కథ




# కర్తవ్యం

డా॥ కాంచనపల్లి

"డియర్ ఫ్రెండ్స్!"

ప్రిన్సిపాల్ రామారావు కంఠం ఖంగుమని మోగింది. ఆ కంఠం రోజూ విన్నదే అయినా స్టాఫ్‌కి చాలా కొత్తగా దర్పం తొణికిసలాడుతూ పలికినట్టనిపించింది.

"మనందరం ఎంతో శ్రమించి ఈ రోజు కళాశాలలో ఒక మంచి వాతావరణం సృష్టించగలిగాం. ఇన్ని రోజులూ మీలో ఒకడుగా, ఒక సీనియర్ లెక్చరర్‌గా పని చేసిన నేను, మీ అందరి కృషి వల్ల ప్రిన్సిపాల్‌ని అయ్యాను. ఇంత వరకు ఛాందసంగా వ్యవహరించిన వ్యక్తి స్థానంలో నన్ను ప్రిన్సిపల్ చేశారు. గతంలోని ఒంటెద్దు పోకడలు ఇక పునరావృతం కాకుండా చూసుకుందాం. మీరంతా సోల్జర్స్ లాగా పని చేసి ఈ కాలేజీకి, ప్రిన్సిపాల్‌కి మంచి పేరు తీసుకురావాలి."

ఆధ్యాపకులందరి మొహాలూ చిరునవ్వుతో వెలిగిపోయాయి. వాళ్లకి ప్రిన్సిపల్ మాటల్లో కొంచెం అతిశయం కనిపించినా, అంత పట్టించుకోలేదు. తప్పకుండా కలిసి కట్టుగా పనిచేయాలనే భావన కనిపించింది.

అంత వరకూ పాత మేనేజ్‌మెంట్‌తో పాత భావాలున్న ప్రిన్సిపాల్‌తో అంతా తెగ ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు చాలా కారణాల వల్ల పాలకవర్గం అంతా మారిపోయింది. తమలో ఒక వ్యక్తే సీనియారిటీ కారణంగా ప్రిన్సిపాల్ అయ్యాడు. అతను ప్రిన్సిపాల్ అయిన వెంటనే ఏర్పాటు చేసిన మొదటి స్టాఫ్ మీటింగ్ ఇదే.

అందరూ స్వాతంత్ర్యం పొందిన భారతీయుల్లా ఊపిరి పీల్చుకున్నారు.

000

"ఏం మాస్టారూ, క్లాసు ఐదు నిమిషాలు మొదటే వదిలేశారు!" ప్రిన్సిపాల్ మాటలకు క్లాసు నుంచి బయటకు వస్తున్న ఇంగ్లీషు లెక్చరర్ వాసు ఖంగు తిన్నాడు. టైం చూసుకున్నాడు. అవును, తను ఐదు నిమిషాలు ముందుగానే వదిలేశాడు క్లాసు.

"సారీ సర్, అగెయిన్ ఇట్ వోంట్ హాపెన్" అన్నాడు.

"నేనూ, అదే చెబుతున్నాను. ఇట్ షుడ్ నాట్ హాపెన్ అగెయిన్."

రామారావుకి మనసులో మహాసంతోషంగా ఉంది. బయటికి ఒలకబోస్తూ తన చాంబర్ వైపు వెళ్లాడు.

'ఈ ప్రిన్సిపాల్ పదవి కోసం ఎన్ని కలలు కన్నాడు! ఐ షుడ్ ఎంజాయ్ మై పవర్ అండ్ ఐ షుడ్ మేక్ ఎనీబడీ నో వాటీజ్ ప్రిన్సిపాల్...' ఆలోచిస్తూ తన చాంబర్‌కి వచ్చేసరికి, బాటనీ లెక్చరర్ రత్న అక్కడ కూచుంది. ప్రిన్సిపాల్‌ని చూస్తూనే గౌరవంగా నిలబడింది.

"ఏమిటీ, మీరిక్కడున్నారు ఈ టైమ్‌లో?" తన కుర్చీలో కూర్చుంటూ నొసలు చిట్లించి అడిగాడు.

"ఇప్పుడు నాడు లీజర్ సర్. ఈ టైమ్‌లోనే మిమ్మల్ని ఓ విషయం రెక్వెస్ట్ చేద్దామని వచ్చాను."

ఏమిటన్నట్టు చూశాడు.

"మా నాన్నకు సీరియస్ అని ఊరి నుండి ఫోన్ వచ్చింది..." చెబుతుంటే ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. "నేను వెళ్లాలి. రేపు నాకు లీవ్ కావాలి సర్.." గొంతు గాద్గదికం అవుతుండగా చెప్పింది.

రామారావుకి వెంటనే తన పవర్ ఎంజాయిమెంట్ గుర్తుకొచ్చింది. "ఇలా అందరూ ఎప్పుడు పడితే అప్పుడు లీవ్‌లు అడిగితే, నేను కాలేజీ ఎలా రన్ చేయాలి? ఇప్పుడు కుదరదు!" గొంతులోకి కాఠిన్యం తెచ్చుకొని చెప్పాడు.

"నా సిలబస్ అప్ టు డే పూర్తి చేశాను సర్. టీచింగ్ డైరీ అటెండెన్స్ అన్నీ పూర్తి చేశాను. రేపటి నా క్లాస్ ఫిజిక్స్ లెక్చరర్ ఎంగేజ్ చేస్తాన్నారు. కాలేజీ ఫంక్షనింగ్‌కి ఎలాంటి అవాంతరం రాకుండా ఏర్పాటు చేసుకున్నాను. దయచేసి లీవ్ గ్రాంటు చేయండి..." రత్న కన్నీళ్ల పర్యంతం అవుతూ అభ్యర్థించింది.

రామారావు గొంతు మరింత పెంచాడు. "ఏమిటీ? మీ అందరికి కాలేజీ అంటే తమాషా అయిందా? నా ప్రమేయం లేకుండానే మీరన్నీ అడ్జస్ట్ చేసేసుకుంటే ఇక ఇక్కడ ప్రిన్సిపాల్ ఎందుకు? ఇంత విధేయత లేనివాళ్లకు నేను ఫేవర్ చేయాలా? నేను లీవ్ ఇవ్వను గాక ఇవ్వను!"

రత్న మళ్లీ ఏదో చెప్పబోయింది.

"నాకు వేరే పనులున్నాయి. మీరు వెళ్లవచ్చు." ఫైల్లో తలదూర్చుతూ అన్నాడు.

రత్న రెండు క్షణాలు మౌనంగా కూచుంది. తరువాత ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా లేచి అక్కడి నుండి వెళ్లిపోయింది.

"ప్రదీప్!" గట్టిగా అటెండర్‌ని పిలిచాడు రామారావు.

"ఒకసారి వెళ్లి అన్ని క్లాసులూ చూసిరా. లెక్చరర్స్ అంతా వెళ్లారో లేదో."

"అలాగే సార్" ప్రదీప్ వెళ్లిపోయాడు.

రామారావు ఛాతీ గర్వంతో ఉప్పొంగింది. నిన్న మొన్నటి దాకా తనూ లెక్చరరే, కానీ ఇప్పుడు వీళ్లందరికీ తాను బాస్. అందరూ తను కనుసన్నల్లో మెలగాల్సిందే!

"మే ఐ కమిన్ సర్?" ఎకనామిక్స్ లెక్చరర్ కృష్ణ, పి.డి. భావనాయకం లోపలికి వచ్చారు.

"నాకిప్పుడు లీజర్ సర్. మీతో కొంచెం మాట్లాడుదామని వచ్చాను" కృష్ణ అన్నాడు.

"చెప్పండి విషయం సంక్షిప్తంగా సూటిగా ఉండాలి. నా టైమ్‌ని అట్టే వేస్ట్ చెయ్యొద్దు. చెప్పండి."

"కూచుని దినపత్రిక చదవడమే గాని ఇతగాడు చేసే పనేంటి? కర్రపెత్తనం కూడా పనేనేంటి?" భావనాయకం గొణిగినట్టన్నాడు.

"ఏమిటి అంటున్నారు?" రామారావు కొంచెం ఉరిమినట్టు అడిగారు.

"ఏం లేదు సార్, మన కృష్ణ సర్, మీతో మాట్లాడుతానంటే కూడా నేను వచ్చాను."

"చెప్పండి చెప్పండి."

"నిజానికి మీరిద్దరూ మంచి ఫ్రెండ్స్. ఏరా అంటే ఏరా అనుకున్నవారే. సీనియారిటీలో కూడా సుమారుగా ఇద్దరూ ఒకటే."

రామారావు ఒక్కసారి అరిచినంత పని చేశాడు. "వాటీజ్ దిస్ హెల్? హూ ఆర్ యూ టు టెల్ ఆల్ దీజ్ థింగ్స్ టు మీ? నిజంగా అలాంటిది వస్తే నన్నడగడానికి పై అధికారులున్నారు. కరస్పాండెంట్ ఉన్నారు. నేను వాళ్లకి జవాబుదారిని కాని మీకు కాదు. మీరు మీ డ్యూటీ సరిగా చేయండి చాలు."

"అవన్నీ ఇప్పుడెందుకు? విషయం చెప్పండి..." వాచ్ చూస్తూ అన్నాడు రామారావు.

"ఈ మధ్య పేపర్లో విద్యామంత్రిగారు ఆదేశించినట్టు ఓ న్యూస్ వచ్చింది సర్. కంపల్సరీ క్లాసు తీసుకోవాలనే జీవోని స్ట్రిక్ట్‌గా అమలు చేస్తారట...!"

రామారావు నిటారుగా అయ్యాడు.

"ఇన్ని రోజులుగా ఆజీవోని మన దగ్గర పాటించపోయినా ఎవరూ పట్టించుకోలేదు. కాని ప్రభుత్వం ఈ విషయంగా సీరియస్‌గా ఉన్నప్పుడు మనమూ జాగ్రత్తగా ఉండాలి కదా సర్! మన కాలేజీలో ఇంగ్లీష్ వర్క్ లోడ్ చాలా ఎక్కువగా ఉంది. రిజల్టు పూర్‌గా ఉంది. కాబట్టి కనీసం మీరు ఒక ఇంగ్లీషు క్లాస్ ఎంగేజ్ చేయండి. మీ వెల్‌విషర్స్‌గా ఈ మాట చెబుతున్నాం" కృష్ణ చాలా అనునయంగా చెప్పాడు.

రామారావు ఒక్కసారి అరిచినంత పని చేశాడు. "వాటీజ్ దిస్ హెల్? హూ ఆర్ యూ టు టెల్ ఆల్ దీజ్ థింగ్స్ టు మీ? నిజంగా అలాంటిది వస్తే నన్నడగడానికి పై అధికారులున్నారు. కరస్పాండెంట్ ఉన్నారు. నేను వాళ్లకి జవాబుదారిని కాని మీకు కాదు. మీరు మీ డ్యూటీ సరిగా చేయండి చాలు."

"మిమ్మల్ని తప్పు పట్టాలని మా ఉద్దేశం కాదు సార్..." ఇంకేదో చెప్పబోయాడు భావనాయకం.

"స్టాపిట్ ఐసే స్టాపిట్! బి ఎవే ఆల్ దీస్ మ్యాటర్స్. మీ పనులు మీరు సక్రమంగా చేయండి. నౌ యుకెన్ గో. డోంట్ వేస్ట్ మై టైమ్." న్యూస్ పేపర్లో తలదూర్చి అన్నాడు.

000

"ప్రదీప్, లంచ్ బాక్స్ తీసుకురా!" తన రెస్ట్ రూం వైపు నడుస్తూ చెప్పాడు రామారావు. లంచ్ అవర్‌లో ప్రదీప్, గబగబా బ్యాగ్‌లోని లంచ్ బాక్స్ తీసుకొని ప్రిన్సిపాల్ రెస్ట్ రూం వైపు పరుగు తీశాడు. ప్లేటు శుభ్రంగా కడిగి టేబుల్ పై ఉంచాడు. మంచి నీళ్ల గ్లాసు అమర్చాడు.

రామారావు ఠీవిని ఒలకబోస్తూ అక్కడికి వచ్చాడు. అతన్ని చూసి విద్యార్థులంతా నిశ్శబ్దం అయిపోవాలని అనుకున్నాడు. కాని విద్యార్థులు అతన్నేం పట్టించుకోకుండా లంచ్ చేస్తూ, కొందరూ నోట్స్ రాసుకుంటూ కొందరు కూచున్నారు. విద్యార్థులందరినీ కేకేయాలనిపించింది. కాని కేక వేయాల్సిన కారణం లేక పోవడం వల్ల, మనసులో ఉడుక్కుంటూ రెస్ట్ రూం వైపు వెళ్లాడు. ప్రదీప్‌నీళ్లు పోస్తే చేయి కడుక్కున్నాడు.

'ప్రదీప్ ఈయనకు వ్యక్తిగత బానిసా ఏంటీ? ఇలా పని చేయించుకుంటున్నాడు..!" దూరం నుంచి ఇదంతా గమనిస్తున్న కామర్స్ లెక్చరర్ కమలాకర్ గొణుక్కున్నాడు.

రామారావుకి ప్రదీప్ సేవ మహా సంతోషాన్ని కల్గించింది. ప్రదీప్ బెడ్ సవరిస్తే, భోంచేసి గురక పెట్టి కాసేపు నిదురపోయాడు.

లంచ్ అవర్ ముగిశాక మళ్లీ రౌండ్స్ వెళ్లాడు. లెక్చరర్స్ అంతా క్లాసులకు వెళ్లిపోయారు. అంతా సవ్యంగా జరుగుతోంది.

అతనికి బాధ కలిగింది 'ఛ, ఒక్కరైనా చిన్న తప్పుచేసినా బాగుండేది. తనకు అధికారం ప్రదర్శించే అవకాశం వచ్చేది! ఇలా అంతా బాగుంటే ఎలా?' ఆలోచిస్తూ స్టాఫ్ రూం వైపు వెళ్లాడు.

మాథ్స్ లెక్చరర్ ప్రభాకర్ బెంచీ మీద పడుకొని గురక పెడుతున్నాడు. తెలుగు లెక్చరర్ గిరి నోట్సు రాసుకుంటున్నాడు.

ఎవరూ రామారావును పట్టించుకోలేదు.

"ఏమిటిదీ? స్టాఫ్ రూం నిద్రపోవడానికా?" హుంకరించాడు రామారావు. తన ప్రతాపం చూపే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

రామారావు అరుపులకు ప్రభాకర్ లేచాడు. రామారావు వైపు కనీసం కన్నెత్తయినా చూడకుండా కూజాలోని నీళ్లు గ్లాసుతో తాగి బయటకు వెళ్లాడు.

"ఏమిటి ఇలా సమాధానం చెప్పకుండా వెడుతున్నాడు?" గిరిని చూస్తూ అన్నాడు.

"సార్‌కి ఆరోగ్యం బాగా లేనట్టుంది. లీవ్‌కి అప్లయ్ చేద్దామంటే మీతో పేచీ. అందుకే తన క్లాసులు పూర్తి చేసుకుని రెస్ట్ తీసుకున్నారేమో!"

"అలాగని కాలేజిలో నిద్ర పోతారా?" గుర్రుగా అడిగాడు

"వెళ్లి ఆయన్నే అడగండి!" గిరి తన నోట్స్‌లో తల దూర్చాడు.

రామారావుకేం పాలు పోలేదు. మెల్లగా తన ఛాంబర్ వైపు వెళ్లాడు.

రత్న బయటకు వస్తూ చెప్పింది. "రేపటి లీవ్ లెటర్ టేబుల్ మీద ఉంచాను సర్. నేను రేపు రావడం లేదు."

"అదేమిటి? మీకు లీవ్ గ్రాంట్ చేయలేదు కదా [illegible]

తారు?"

"వెళ్లక తప్పదు. నాన్నకి సీరియస్ అంటే వెళ్లకుండా ఉండాలా?"

"ఇలా చేస్తే యాక్షన్ సివియర్‌గా ఉంటుంది."

"ఏదైనా చేసుకోండి. నేను వెళ్లి తీరాలి!" అతని సమాధానం కోసం చూడకుండా వెళ్లిపోయింది రత్న.

రామారావు హతాశుడైపోయాడు. నిస్సత్తుగా కుర్చీపై కూలబడి పోయాడు.

000

స్టాఫంతా కాలేజీకి వస్తున్నారు. సక్రమంగా క్లాసులకు వెడుతున్నారు. ఎవరూ ఒక నిముషం కూడా ఆలస్యంగా రావటం లేదు. ప్రిన్సిపాల్‌ని ఎలాంటి మినహాయింపులూ అడగటం లేదు. అసలు ఒక ప్రిన్సిపాల్ అనే వాడున్నాడని కూడా ఎవరూ గుర్తించడం లేదు.

రామారావుకు మహాఅవమానంగా ఉంది. ఎవరూ తన దగ్గరకు రావడం లేదేం? తనని లీవ్ గ్రాంటు చేయమనో, మరి దేనికో రెక్వెస్ట్ చేయరేం? తను ప్రిన్సిపాల్ అయితే అయ్యాడు కాని, తన అధికారానికి గుర్తింపు లేకపోతే ఎందుకీ పదవి?

తనే కల్పించుకొని, "టీచింగ్ డైరీ ఇలా రాయాలి. ఆన్సర్ పేపర్లు ఇలా దిద్దాలి" అని లెక్చర్లు దంచసాగాడు. అందరూ తలూపుతున్నారు. వెళ్లిపోతున్నారు. అతని కోపాన్ని గాని, అధికారాన్ని గాని, అతని ఏ రకమైన ఉనికిని కాని ఎవరూ పట్టించుకోవడం లేదు.

తన చాంబర్‌కి ఎవరికైనా పిలిస్తేనే వస్తారు. తను చెప్పింది విని తలూపి వెళ్లిపోతారు. తానే క్లాసు రూంకి వెడితే క్లాసులున్న వాళ్లు క్లాసులకు వెడతారు. లీజరు ఉన్న వాళ్లు తనని పట్టించుకోకుండా, వేరే పని చేస్తుంటారు. తన ఇంటికి కూడా ఇదివరకటిలా ఎవరూ రావడం లేదు. ఈ మధ్యనే అమ్మాయి పుట్టినరోజని అందరినీ ఆహ్వానించాడు. ఎవరూ రాలేదు. వాళ్లిళ్లకు కూడా ఎవరూ తనను పిలవడం లేదు.

క్లాసులకు సక్రమంగా వెళ్లి పాఠాలు చెబుతున్నారే కాని ఆ చేసే డ్యూటీలో చిత్తశుద్ధి లేదు. ఇది కేవలం ప్రిన్సిపాల్ పని అన్నట్టుంది వ్యవహారం. ఈ కాలేజీ ప్రిన్సిపాల్‌ది. ఇక్కడ మన బాధ్యత ఏది లేదు. మన పనిని మనం చేసుకొని వెళ్లిపోవాలి. ఇదీ స్టాఫ్ ధోరణి. తాను రాకపోతేనైనా ఎవరైనా తప్పు చేస్తారేమో పట్టుకోవచ్చునని కొన్ని సార్లు లీవ్ పెట్టి చూశాడు. ఎంక్వైరీ చేస్తే తాను రాని రోజు కాలేజీ మరింత కరెక్టుగా జరిగినట్టు అర్థమైంది.

రామారావుకి ఏమీ పాలు పోవడం లేదు. ఎందుకిలా జరుగుతుంది? ఎందుకిలా తను ఒంటరివాడై పోతున్నాడు? ప్రిన్సిపాల్ కావడమే తన నేరమా?

ఇంతలో న్యూ అడ్మిషన్‌కి విద్యార్థుల దగ్గర అతను డబ్బు వసూలు చేశాడనే అభియోగం వచ్చింది. ఎవరో అజ్ఞాతవ్యక్తులు డి.ఐ.యి.కి కంప్లయింట్ చేశారు.

ఆర్.ఐ.ఒ. ఎంక్వయిరీ జరిగింది.

ఆర్.ఐ.ఓ. ప్రతి లెక్చరర్‌నూ ఎంక్వయిరీ చేశాడు. ప్రతీ లెక్చరర్ నుండి వచ్చిన సమాధానం ఒకటే... "నాకు తెలియదు."

నిజం తెలిసినా ఎవరూ ప్రిన్సిపాల్‌ని అపోజ్ చేయలేదు. అలాగని సపోర్టూ చేయలేదు. చివరికి రామారావే ఎలాగోలాగ మేనేజ్ చేసుకున్నాడు. తామంతా ఇదివరకు ఒక కుటుంబంలాగా ఉండేవారు. ఇప్పటికీ ఏ స్టాఫ్ మెంబర్‌కు ఓ సమస్య వచ్చినా స్టాఫంతా కలిసి ఎదుర్కోవడానికి ప్రయత్నం చేస్తారు. అలాంటిది ఇలా అంతా తన్ను వెలివేశారేమిటీ? ఏమిటి తాను చేసిన తప్పు? రామారావు తనలో తానే కుమిలిపోయాడు.

000

రామారావు లాంగ్ లీవ్ పెట్టుకున్నాడు. కాలేజీకి స్వాతంత్ర్యం వచ్చినట్టుగా అంతా ఉత్సాహంగా పని చేస్తున్నారు.

కృష్ణ ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్నాడు.

రామారావు వెంట వెంట అన్ని విషయాలూ తెలుసుకుంటూ కుమిలిపోతున్నాడు. తాను లేకపోతే కాలేజీ మరింత బాగా నడుస్తుంది. ఎవరైనా తప్పు చేస్తే బాగుండు. తాను లేకపోవడం వల్ల అంతా అస్తవ్యస్తమైతే బాగుండు.

రామారావు దూరబంధువు వైదేహి డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్‌లోని జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్. తరచు ఆమెనూ, ఆ కాలేజీనీ అధికారులంతా మెచ్చుకోవడం విన్నాడు. ఏమిటి ఆమె గొప్పతనం? ఓ సారి వెళ్లి చూస్తే...?

వెంటనే వైదేహికి ఫోన్ చేసి తాను వస్తున్నానని చెప్పి బయలుదేరాడు.

అక్కడి కాలేజీ పరిస్థితులే విచిత్రంగా ఉన్నాయి. అక్కడ ఎవరూ, ఎవరికీ అధికారులు కాదు. పని సవ్యంగా జరగడానికే కాని తనను అధికారిగా అంతా గుర్తించాలని వైదేహి అసలే ప్రయత్నం చేయదు.

"మేడమ్, నాకు కొంచెం టెంపరేచర్ ఉంది. క్లాసుకు వెళ్లలేను" ఇంగ్లీష్ లెక్చరర్ ఆనంద్ చెప్పాడు.

"అలాగే మీరు రెస్ట్ తీసుకోండి. మీ క్లాస్‌కు నేను వెడతాను లెండి."

"థాంక్యూ మేడమ్!"

వైదేహి గవర్నమెంట్ ఉత్తర్వు ప్రకారమే టైం టేబుల్ సెట్ చేయించింది. తాను ప్రతి రోజూ తన సబ్జెక్టు రెండు క్లాసులు తీసుకుంటుంది. ఈ రోజు ఇంగ్లీష్ లెక్చరర్ క్లాసు కూడా తీసుకుంది.

వైదేహి టిఫిన్ బాక్స్ స్టాఫ్ రూంకే తీసుకెళ్లి అందరితో తనూ లంచ్ తీసుకుంది. రామారావుని అందరికీ పరిచయం చేసింది. తను తెచ్చినవి స్టాఫ్‌కి పెట్టింది. స్టాఫ్ పెట్టింది తాను తీసుకుంది.

సడన్‌గా ఫిజిక్స్ లెక్చరర్ తల్లికి బాగాలేదని ఫోన్ వచ్చింది. వెంటనే లీవ్ గ్రాంట్ చేసింది. ఆందోళన పడుతున్న అతనికి ధైర్యం చెప్పింది. "ఏ హాస్పిటల్‌లో చేరుస్తున్నారో ఫోన్ చేసి చెప్పండి. డబ్బు ఏదైనా అవసరమైతే వెంటనే ఫోన్ చేయండి. అంతా కలిసి అడ్జస్ట్ చేస్తాం. వర్రీ అవకుండా చేయాల్సినదంతా చేయండి" అంటూ,

"అలాగే మేడమ్!" అంటూ థాంక్స్ చెబుతూ తొందరగా వెళ్లిపోయాడతడు.

వైదేహి దగ్గరకు వెడితే స్టాఫ్‌లో ఎవరైనా ఆమె వారించినా వినకుండా నిలబడి విష్ చేస్తారు. స్టాఫ్ గాని, విద్యార్థులు గాని ఆమె పైన ఈగను కూడా వాలనివ్వరు.

విద్యార్థులు మేడమ్‌ని దేవతలాగా చూస్తారు.

ఆమె వ్యక్తిగతంగా ఎంత స్నేహంగా ఉంటుందో, తాను చేయవలసిన పని పట్ల అంత కఠినంగానూ ఉంటుంది. ఇతరులకు ఆజ్ఞనివ్వడమే కాకుండా ముందు తానే పని చేయడం మొదలుపెడుతుంది. మిగతా వాళ్లంతా రెండవ మాటకు స్థానం లేకుండా పని చేస్తారు. తాను అవిశ్రాంతంగా పని చేస్తుంది. మిగతావాళ్లతోనూ చేయిస్తుంది. అటెండర్ దగ్గర నుంచి ఎవరి పైనైనా తన అధికార దర్పం ఏ నాడూ అనవసరంగా ప్రదర్శించదు!

అక్కడి పరిస్థితి అంతా చూశాక, రామారావు మనస్సులో ఏదో వెలుగు పరుచుకున్నట్టయింది. తాను ప్రవర్తించాల్సిన పద్ధతి అతనికి అర్థమైంది. వైదేహి దగ్గర సెలవు తీసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు.